

డాక్టర్ తేజ సూరత్‌కు ఉత్తమ ఇంజినీర్ పురస్కారం



ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరుకు చెందిన శ్రీ సోమా కనస్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ తేజ సూరత్ ఉత్తమ ఇంజినీర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన హిందూ దినపత్రిక, రామ్‌కో వారి ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి ఉమెన్స్ యూనివర్సిటీలో ది బెస్ట్ ఇంజినీర్స్ అవార్డు ప్రదానం నేపథ్యంలో తేజ సూరత్ ఈ పురస్కారానికి అందుకోనున్నారు. ఈ పురస్కారానికి ఎంపిక కావడంపై డాక్టర్ తేజ సూరత్ ఆనందం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యమా.. అలసత్వమా..!

ప్రభుత్వాసుపత్రుల్లో మృత్యు ఘోష
టి.నరసాపురంలో బాలింత, బొర్రంపాలెంలో పసికందు మృతి
ఆసుపత్రులపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
ఆందోళనలో ప్రజలు



బిడ్డ మృతి చెందడంతో రోదిస్తున్న తల్లి (ఫైల్)

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యమో.. అలసత్వమో..మరే ఇతర కారణమో తెలియదుగాని అమాయకుల ప్రాణాలు మాత్రం బలైపోతున్నాయి. మండలంలో టి.నరసాపురం, బొర్రంపాలెం పిహెచ్‌సిల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అత్యవసర పరిస్థితుల్లోనే కాదు మామూలు డెలివరీకి, వైద్యానికి ఆసుపత్రికి వెళ్లినా సరైన వైద్య సేవలు సమయానికి అందక మృత్యుఒడిలోకి చేరుతున్నారు. గత ఆగస్టు 6న టి.నరసాపురం ప్రభుత్వానికి ఆసుపత్రికి వెళ్లిన బాలింత మృతి చెందగా ఈ నెల 9న బొర్రంపాలెం ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన గర్భిణీ పుట్టిన వెంటనే పసికందును కోల్పోయింది. అసలే రోగాలు ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో పిహెచ్‌సిలకు వెళ్లేందుకు జనం వెనుకాడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్య బాధితులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని, మరణాలు లేకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన వగ్గెల అలివేలుకు నెలలు నిండటంతో కుటుంబీకులు గత జులై 27న జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఆపరేషన్ చేసి కాన్పు చేశారు. మగ బిడ్డ పుట్టాడు. అనంతరం ఆగస్టు 5న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చారు. అదేరోజు రాత్రి అలివేలు అనారోగ్యంగా ఉందని భర్త రాముకు చెప్పడంతో కుటుంబీకులు మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లారు. అక్కడ సరైన సమయంలో వైద్య సేవలు అందక తిరిగి పరిస్థితి విషమంగా ఉందని 108 సహాయంతో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో బాలింత మృతికి టి.నర్సాపురం వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు వచ్చి విచారణ చేస్తారన్నారుగానీ ఇప్పటి వరకు విచారణ తేల్చలేదు.

అదేవిధంగా మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన రేఖకు నెలలు నిండి పురిటి నొప్పి రావడంతో ఈ నెల 8న ఆదివారం రాత్రి బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఈ క్రమంలో ఆమెను పరీక్షించిన వైద్యులు డెలివరీ కావడానికి సమయం పడుతుందని చెప్పారు. అయితే వైద్య చికిత్సలో జాప్యం చేస్తూ వచ్చారని, 9న సోమవారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత వైద్యులు సాధారణ కాన్పు చేశారని బంధువులు చెబుతున్నారు. అనంతరం బిడ్డను జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారు. అయితే అప్పటికే బిడ్డ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రికి చేరుకుని బిడ్డ మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. అయితే బిడ్డకు తల్లి కడుపులోనే పేగు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యురాలు ఇమాంబి చెబుతున్నారు. అయితే డెలివరీకి ముందు బాధితురాలికి స్కానింగ్ చేసినప్పుడు బిడ్డకు పేగులు చుట్టుకున్నట్టు లేదని వైద్యులు చెప్పారని బంధువులు అంటున్నారు. ఈ రెండు సంఘటనల్లో బాలింత, పసికందు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఎమర్జెన్సీ అయితే అనారోగ్య బాదితులను ఇతర ప్రాంతాలకు తరలించాలి గానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని, కారకులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా మండల నాయకురాలు మడకం కుమారి డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆసుపత్రులను ఉన్నతాధికారులు సందర్శించి వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని, ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని ఆమె కోరుతున్నారు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని, అందుకే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రుల్లో మరణాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం నెలకో, రెండు నెలలకోసారి జిల్లా అధికారులు ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తే వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేస్తారని, రోగులకు సరైన వైద్యం అందుతుందని వారంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆసుపత్రుల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత



బాలింత మృతి చెందడంతో ఆందోళన చేస్తున్న బంధువులు (ఫైల్)

మండల కేంద్రమైన టి.నరసాపురం, బొర్రంపాలెంలో పిహెచ్‌సిలు ఉండగా వీటి పరిధిలో 15 పంచాయతీల్లో గ్రామాలకు వైద్య సదుపాయాలు అందించేందుకు 46 మంది ఆశావర్కర్లు, 14 మంది ఎఎన్ఎంలు, 14 మంది ఎంఎల్‌హెచ్‌లు, ఐదుగురు సూపర్‌వైజర్లు, ఒక ఫార్మాసిస్ట్, ఫిమేల్ నర్సింగ్, ఎంఎన్ఒలు, ఒక వాచ్‌మెన్, ముగ్గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ముగ్గురు సూపర్‌వైజర్లు, 15 సచివాలయాల హెల్త్ అసిస్టెంట్లు 15 మంది, లాబ్ టెక్నీషియన్, వాచ్‌మెన్‌లు లేరని మండల వైద్యాధికారి జె కల్పనారాణి తెలిపారు. వైద్య సిబ్బంది కొరతతో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందే పరిస్థితి లేదని ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని ప్రజాసంఘాల నాయకులు అనుమోలు మురళీ డిమాండ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నేరగాళ్ల వలలో చిక్కి తమ డబ్బును పోగొట్టుకున్న వారు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా తిరిగి వారి సొమ్మును వెనక్కి తెచ్చే అవకాశం ఉందని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రెండు కేసులకు సంబంధించి రూ.రెండు లక్షలు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అప్పగించామని తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మహిళ ఆన్‌లైన్ వచ్చిన ఓ ప్రకటనలో కొంత సొమ్మును ఇన్వెస్ట్ చేయడం ద్వారా తిరిగి పెద్ద మొత్తంలో పొందవచ్చని తెలుసుకుంది. వెంటనే ఆమె ప్రకటన ఇచ్చిన వారి ఖాతాకు దఫాలుగా రూ.90 వేలు జమ వేసింది. రోజులు గడుస్తున్నప్పటికీ సొమ్ము తిరిగి రాకపోవడంతో ఏలూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే మూడో పట్టణ పరిధిలోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటనను చూసి అధిక వడ్డీ తక్కువ సమయంలో వస్తుందని రూ.1.10 లక్షలు వారి ఖాతాకు పంపించాడు. రోజులు గడుస్తున్నప్పటికీ అతని సొమ్ము తిరిగి రాకపోగా అతడిని సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు గురి చేస్తుండడంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన సైబర్ సెల్ ఎస్ఐ మధు వెంకటరాజా ఆ సొమ్మును రికవరీ చేసేందుకు పూర్తిస్థాయిలో కృషి చేశారు. త్వరితగతిన రెండు కేసుల్లో సొమ్మును పోగొట్టుకున్న ఇద్దరికీ తిరిగి వారి ఖాతాలో జమ చేశారు. సైబర్ నెరగాళ్లు నూతన మార్గాలను ఎంచుకుని ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్‌పి తెలిపారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే తక్కువ సమయంలో సైబర్ సెల్ 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు పోగొట్టుకున్న సొమ్మును వారు సైబర్ నేరగాళ్ల వద్ద నుంచి తిరిగి వచ్చేందుకు చర్యలు చేపడతారని తెలిపారు. సైబర్ సెల్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ మధు వెంకటరాజా టెక్నికల్ టీం శివలను అభినందించినట్లు తెలిపారు.

ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం

ప్రముఖ సినీనటుడు సుమన్

ప్రజాశక్తి - పెదపాడు

ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. శనివారం వట్లూరు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఇండోర్ జిమ్నాజియంలో నేషనల్ ఫోటో కాం కరాటే ఛాంపియన్‌షిప్ బడేటి కప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సుమన్ ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతున్నా, ఉద్యోగం చేస్తున్నా రోజుకు అరగంట మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని, తల్లితండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. బిజెపి నాయకులు తపన చౌదరి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ఆత్మ రక్షణ కోసమే కాదని, వ్యాయామంగానూ పరిగణించాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి బుజ్జి మాట్లాడుతూ కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మానసిక ఒత్తిడిని దూరం చేసే గొప్ప ఆయుధం కరాటే అన్నారు. ఏలూరులో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ జాతీయస్థాయిలో కీర్తి గడించిన ఇబ్రహీం షేక్, డిఎల్ నారాయణలను ప్రశంసించారు. క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, నాగం శివ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఏలూరులోని గిరిజన భవన్‌లో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 1,226 మంది హాజరు కాగా 566 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ నియామక పత్రాలు అందించారు. ముందుగా ఎంపీ జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం జాబ్‌మేళాను ఉద్దేశించి మాట్లాడుతూ ముందుగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న యువత కోసం వారి నైపుణ్యాల ప్రకారం 11 కంపెనీలు వచ్చాయన్నారు. ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తమపై ఉందన్నారు. స్కిల్స్ నేర్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. వచ్చే రోజుల్లో మరిన్ని కంపెనీలు తెస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. అందరికీ ఉద్యోగాల కల్పనే తన ధ్యేయమన్నారు. ఏలూరుకు పెద్దఎత్తున పరిశ్రమలు తెస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రు బాలు, మాగంటి హేమసుందర్, ముమ్మిడి చింతయ్య, నందిగం బాబి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి ఏచూరి

పలుచోట్ల సంతాప సభలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

భారతదేశం మొత్తం గర్వించదగ్గ గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన ఆర్.సత్యనారాయణ (ఆర్ఎస్)ల సంతాప సభ శనివారం సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ ముద్దుబిడ్డ సీతారాం ఏచూరి అని అన్నారు. విద్యార్థి ఉద్యమంతో మొదలై వామపక్ష ఉద్యమంలో జాతీయ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణ (ఆర్ఎస్) మృతి చెందడం ప్రజా ఉద్యమాలను కలిచివేసిందని మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. అమర వీరుల ఉద్యమ స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు, ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు, ఉడతా వెంకటేష్, వెట్టి వీరయ్య, కొయ్యల శ్రీను, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.కిరణ్, విద్యార్థి సంఘం నాయకులు వినోద్, ఇళ్ళస్థలాల పోరాట నాయకులు పండు, శ్రీదేవి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక అన్నే భవనంలో పి.హైమావతి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి ఉద్యమాల నుంచి భారత కమ్యూనిస్టు ఉద్యమ నేతగా ఎదిగారన్నారు. ఏచూరి ఒక మహోన్నత వ్యక్తి అని, ఆఖరికి మరణాంతరం తన భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థులకు అందించారన్నారు. ఏచూరి మరణం మహిళా ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జి.శారద, కె.సుకన్య, లక్ష్మి, అమ్ము, ప్రసన్న, కె.జనని, సంజన, పుష్ప పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో...



ఏలూరులో...



కలిదిండిలో...

చింతలపూడి : సీతారాం ఏచూరి తను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకూ పోరాటం కొనసాగించారని సిఐటియు యూనియన్ అధ్యక్షులు పి.బాలక్రిష్ణ అన్నారు. ఏచూరి మృతికి సీతారామిరెడ్డి గోడౌన్ ఆగ్రో వెల్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ భుక్యా నాగరాజు మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల కోసం సీతారాం ఏచూరి రాజ్యసభలో అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి నత్తా వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సిపిఎం మహదేవపురం శాఖ ఆధ్వర్యంలో సీతారం మృతికి సంతాపం తెలిపారు. సిపిఎం మహదేవపురం శాఖ కార్యదర్శి సోదెం దుర్గారావు, శుక్లబోయిన రాంబాబు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోతుపోయిన మంగాయమ్మ, గోరుముచ్చి జ్యోతి, కుంజం సంకురమ్మ, పూసం చెల్లయ్య, సోదెం దుర్గారావు, సోదెం బుచ్చమ్మ, పోతుబోయిన వీరయమ్మ, ఎం.దుర్గమ్మ పాల్గొన్నారు.

కుక్కునూరు : మండలంలోని దాచారంలో సిఐటియు ఆధ్వర్యంలో పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడారు. ఏచూరి మృతికి సంతాప సూచకంగా వారం రోజుల పాటు సిఐటియు పతాకాన్ని అవనతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, యుటిఎఫ్ నాయకులు ఉప్పే మహాలక్ష్మయ్య, పునెం పోసిబాబు, సిఐటియు నాయకులు పోచారపు వెంకన్నబాబు, మేడవరపు రమాదేవి, కృపజ్యోతి, మంగ, శ్రీలత, పున్నమ్మ, సుజాత, విశ్వనాద్ పాల్గొన్నారు.

దెందులూరు : ది ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు అరుణాకర నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అడపా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కర్రి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు గుమ్మళ్ల వెంకట సూర్యనారాయణ, సయ్యద్ బోటీ, షేక్ జుల్ఫీ, మాజీ ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, అసోసియేషన్ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, పర్మిట్, షఫీ పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని భాస్కరరావుపేట, మూలలంక, రామకృష్ణాపురం, కోరుకొల్లు, సానా రుద్రవరం గ్రామాల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతాప సభలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు భాస్కరరావు, జ్ఞానేషు, మహేష్, ముంగం సురేష్, వెంకట సత్యనారాయణ, ఏసు, రామనాగేంద్రం, ప్రకాష్, సుబ్రహ్మణ్యం, సోమయ్య, పివి.రామకృష్ణ, పెద్దిరాజు, దుగ్గిరాల వెంకట ప్రసాద్, సిపిఎం, ప్రజాసంఘాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

దుస్తులు పంపిణీ చేసిన యుటిఎఫ్, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

వరద బాధితులకు ఎప్పుడూ అండగా ఉంటామని యుటిఎఫ్ పోలవరం నాయకులు ఉప్పే మహాలక్ష్మయ్య అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులు ప్రతి ఏటా వచ్చే వరదలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ఏడాదిలో ఎక్కువ సార్లు వరదలు రావడం వల్ల మూడు నెలల నుంచి రాయికుంట పునరావాస కేంద్రాల్లో ఉండే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక నిర్వాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీళ్ల ఇబ్బందులు కొంతైనా పరిష్కరించాలని యుటిఎఫ్ పోలవరం మండలంలో దాతల వద్ద నుంచి బట్టలు, కూల్ డ్రింక్స్, బిస్కెట్లు సేకరించి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని, ప్రభుత్వం వీరికి న్యాయమైన ప్యాకేజీ ఇచ్చి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, యుటిఎఫ్ నాయకులు పునేం పోసిబాబు, భుక్యా శివగిరి, కొణతాల నాగేంద్రప్రసాద్, దేశబత్తుల నాగచైతన్య, సిఐటియు నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు, మేడవరపు రమాదేవి, కృపజ్యోతి, మంగ, పున్నమ్మ, సుజాత, శ్రీలత, గొమ్ముగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న నాయకులు

జిఒ 85 రద్దు కోరుతూ నేడు చలో విజయవాడ

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వ ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ చేసే వైద్య విద్యార్థులకు రిజర్వేషన్ శాతాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం జిఒ 85 జారీ చేసింది. ఈ జిఒ పల్లె, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామంలో పని చేసే వైద్యులకు చాలా నష్టం కలుగ చేస్తుందని, దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పిహెచ్‌సిల వైద్యులు గత ఐదు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారు ఏళ్ల తరబడి చేసే సేవలకు విలువ లేకుండా పోతుందని, శనివారం నుంచి అత్యవసర సేవలు మినహా ఏమీ అందిండంలేదని వైద్య సిబ్బంది తెలిపారు. ఆదివారం చలో విజయవాడ ర్యాలీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో, వరదలు వచ్చినప్పుడు, జ్వరాల సీజన్‌లో ప్రతి మూల పల్లెకు వెళ్లి వైద్యం చేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఆందోళన

సిహెచ్.శ్రీసుమ, కామవరపుకోట పిహెచ్‌సి వైద్యాధికారి



జిఒ 85ని తక్షణమే రద్దు చేసి ఇన్ సర్వీస్ కోటా సీట్లలో పిహెచ్‌సి డాక్టర్లకు న్యాయం చేయాలి. వీటితో పాటు టైం బౌండ్ ప్రమోషన్ ఎస్, ఎఫ్‌డిపి అలవెన్స్ వంటివి కూడా సమకూర్చాలి. ప్రభుత్వం దిగి వచ్చేవరకూ మా ఆందోళన కొనసాగిస్తాం. త్వరలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాము.

యుటిఎఫ్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో జిల్లాలోని ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఇప్పటికే మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మీటర్ల రన్నింగ్, 200 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల వాకింగ్, షాట్ పుట్, జావలిన్, స్లో సైక్లింగ్, వాలీబాల్ త్రో, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ మొదలైన స్పోర్ట్స్, గేమ్స్ నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో విజేతలైన వారిని అక్టోబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పక్షాన హాజరు పరచనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫా, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి తెలిపారు. ఈ పోటీలు నిర్వహించడానికి సహకరించిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేష్, మురళి, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆటల పోటీల కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నంబూరి రాంబాబు, జి.దేవానంద్, సిహెచ్.శ్రీధర్, కె.కమల్‌కుమార్, పురేటి శ్రీనివాస్, 28 మండల శాఖల అధ్యక్ష కార్యదర్శులు, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

విలాపం..!

ఇటీవల చోటు చేసుకున్న వరుస ఘటనలు జిల్లావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయి. గోదావరి, కొల్లేరు వరదలు ఆ ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేయడంతోపాటు తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చాయి. జిల్లాకు చెందిన ప్రజా ఉద్యమాల సారధి, ప్రియతమ నేత ఆర్ఎస్ తుదిశ్వాస విడవడం అందరినీ కలిచివేసింది.



ఎప్పటిలానే గోదావరి వరద మరోసారి ఏలూరు జిల్లాలోని విలీన మండలాలతోపాటు పశ్చిమలోని లంకగ్రామాల ప్రజలను బెంబేలెత్తించింది. శరవేగంగా వరద ఉధృతి పెరగడం ఎటువంటి విపత్తుకు దారి తీస్తుందోనని అంతా ఆందోళన చెందారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసిత ప్రజలు వరద ముంపు నుంచి తమను ఎప్పుడు విముక్తుల్ని చేస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. పరిహారం, పునరావాసం ఇచ్చేస్తే తాము వెళ్లేందుకు సిద్ధమేనని చెబుతున్నా నాటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పట్టించుకుంటున్న దాఖలాల్లేవని, అందరి దృష్టి ప్రాజెక్టు పనులపైనే ఉంటుందని వాపోతున్నారు. కొల్లేరు వరదను పరిశీలించడానికి వచ్చిన సిఎం చంద్రబాబు సైతం బుడమేరు వరద తదితర అంశాలపై మాట్లా డారుగాని తమ ఊసే ఎత్తకపోవడం బాధగా ఉందని చెబుతున్నారు. తమను పరా మర్శించేందుకు, తమ కష్టాల పరిశీలనకు రాకపోయినా పర్లేదుగాని తమకు వీలైనంత త్వరగా పరిహారం, పునరావాసం కల్పించాలని, తమ సమస్యకు అదే పరిష్కారమని రెండు మండలాల నిర్వాసిత ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక కొల్లేరు వరద మరోసారి బెంబేలెత్తించింది. కొల్లేరు పరిధిలోని మండవల్లి, కైకలూరు, ఏలూరు రూరల్, పెదపాడు మండలాల్లో గ్రామాలను, చేపల చెరువులను వరద ముంచె త్తింది. పైగా ఏలూరు-కైకలూరు రహదారితోపాటు పలు ప్రధాన రహదారులు నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. అయితే వరద ప్రభావం కన్పిస్తున్న తరుణంలోనే అప్రమత్తమైన కలెక్టర్, ఎస్‌పి నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు కొల్లేరు వరద ప్రవాహానికి ఆటంకంగా ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద ఉన్న అడ్డంకులను తొలగించేలా చేయడంతోపాటు పలు చర్యలు చేపట్టడం కొంత వరద తీవ్రతను తగ్గించిందనే చెప్పొచ్చు. అయితే కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదనేది అందరికీ తెలిసిందే. 2006లో కొల్లేరు ఆపరేషన్ సమయం నుంచి సిపిఎం ప్రధానంగా కొల్లేరు ఛానల్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తోంది. దీంతోపాటు రెగ్యులేటర్ల నిర్మాణం డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కొల్లేరులో తవ్విన భారీ చెరువుల వల్ల నీటిని బయటికి తీసుకెళ్లే ఛానల్స్ అన్నీ పూడిపోయి ముంపు సమస్య పెరుగుతోంది. ప్రస్తుతం దీనికితోడు ఉప్పుటేరులో పూడికతీత చాలాకాలంగా ప్రతిపాదనలు, మాటలకు, తూతూమంత్రపు చర్యలకే పరిమితమవుతోంది. దీంతో ముంపు సమస్య వచ్చినప్పుడల్లా హామీల వర్షం.. ఆపై గాలికొదిలేయడం పాలకులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలానే కొనసాగితే కొల్లేరువాసులకు ముంపు సమస్యతోపాటు భూములు చౌడుబారిపోయే ప్రమాదం ఉందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

మానవ సంబంధాలు @ మార్క్సిస్టులు

పెట్టుబడిదారీ ప్రపంచంలో మనుషుల మధ్య ఉండేవన్నీ ఆర్థిక సంబంధాలేనని మహనీయుడు మార్క్స్ ఏనాడో చెప్పిన విషయాన్ని మనం నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. అయితే సమసమాజం, దాని కోసం అలుపెరగకుండా పని చేసే మార్క్సిస్టు నేతలు మాత్రం మానవ సంబంధాలకే ప్రాధాన్యతిస్తారనేది అందరికీ తెలిసిందే. అటువంటి మానవ సంబంధాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా పోరాటాల సారధిగా పేరొందిన మాజీ ఎంఎల్ఎ, సిపిఎం జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) వయోభారంతో మృతి చెందడం ఉమ్మడి జిల్లావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అప్పటికే పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఉపాధ్యాయ, రైతు ఉద్యమ నేతగా పేరొందిన వలవల శ్రీరామ్మూర్తి తుదిశ్వాస విడవడం, ఆర్ఎస్ మరణించిన నాలుగు రోజులకే నరసాపురంలో కార్మిక నేతగా పేరొందిన పొన్నాడ రాము (బాబాయ్) ఆకస్మిక మృతి సిపిఎం శ్రేణులను కలిచివేసింది. ఆ విషాదాల నుంచి తేరుకోకముందే జిల్లావాసులకు సుపరిచితులు, ఆత్మీయ నేతగా పేరొందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులతోపాటు అభ్యుదయవాదులు, వివిధ పార్టీల నేతలను నివ్వెరపర్చింది. సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పిస్తూ పెద్దఎత్తున సంతాప సభలు జరిగాయి.. జరుగుతున్నాయి. ఆ సభల్లో టిడిపి, జనసేన, వైసిపి నేతలతోపాటు వివిధ సంఘాల నేతలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించడం సీతారాం ఏచూరికి ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనం. ఆర్ఎస్ మృతి సందర్భంగానూ పలు పార్టీల నేతలు, మాజీ ఎంఎల్ఎలు, ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించడంతోపాటు వివిధ సందర్భాల్లో ఆయన వ్యవహరించిన తీరు, ఆత్మీయ పలుకరింపు, కుటుంబాలతో సంబంధాలు గురించి ప్రధానంగా మాట్లాడారంటే మార్క్సిస్టు నేతలు ప్రజాసంబంధాలకు ఎంత ప్రాధాన్యతిస్తారో అర్థం చేసుకోవచ్చు. అందుకే ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రతిపక్షం ఉన్నా లేకపోయినా కమ్యూనిస్టులు మాత్రం ఉండాలని పలువురు కోరుకోవడం వెనుక ఉన్న రహస్యం ఇదే. ఏదేమైనా ఉద్యమాలు, పోరాటాలే కాదు విలువలతో కూడిన మానవ సంబంధాలు నెరపడంలో మార్క్సిస్టులే ముందుంటారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

లయన్స్ క్లబ్ సేవలను వినియోగించుకోవాలి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లయన్స్ క్లబ్ వారు చేసే సేవలను అవసరమైనవారు సరైన సమయంలో ఉపయోగించుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ వారు సమాజానికి చేస్తున్న సేవలు ఎనలేనివని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం దగ్గర ఆఫీసర్స్ క్లబ్ వారి సహకారంతో జివిఎల్ ట్రస్ట్ కేన్సర్, రీసెర్చ్ సెంటర్ వారు ఏలూరు హేలాపురి రూరల్ లయన్స్ క్లబ్ వారు, ఏలూరు దుర్గా తేజ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం, అవగాహన సదస్సులు శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంపును సందర్శించి మాట్లాడారు. లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రెటరీ డాక్టర్ వికె.పంకజాక్షన్, క్యాన్సర్ నిర్ధారణ క్యాంపులో పాల్గొన్న డాక్టర్ విజయ చలకాన్డ్ రవి మాట్లాడారు. వి.శేషుకుమార్, ఎం.కృష్ణమోహన్‌ల సహకారంతో మందులను ఉచితంగా అందించారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి రూరల్ క్లబ్ అధ్యక్షులు ఎంవివిఎస్.నాగేశ్వరరావు, దుర్గాతేజ లయన్స్ క్లబ్ అధ్యక్షులు గీతా వంకట్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి ఎంవి.కృష్ణారావు, క్యాంపు కో-ఆర్డినేటర్స్ డి.రామారావు, డాక్టర్ ఎల్ఎస్ఎన్.నాగేశ్వరరావు, రీజియన్ ఛైర్మన్ ఎం.కృష్ణమోహన్, నాయకులు వెలగపూడి విష్ణుకుమార్, డివి.రమణ, ఎం.శ్రీహరి, వి.శ్రీనివాస్ గోపాల్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

ప్రజాశక్తి - చింతలపూడి


జాతీయ లోక్ అదాలత్ ద్వారా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సి.మధుబాబు అన్నారు. చింతలపూడి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు రాజీ పడవచ్చున్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు కోర్టు వేదికగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భీమడోలు కోర్టు సర్కిల్ పరిధిలోని 25 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయని భీమడోలు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. భీమడోలు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇన్‌ఛార్జి బండి రచన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కాలి గంగరాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గంగాధర్ పాల్గొన్నారు. భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాలి నాగేశ్వరరావు, కోశాధికారి ఇంజేటి విజయ అచ్యుతం, సిరిగినీడి గోపీ, పి.బాలరాజు సహకరించారు.

'ఎన్ఆర్ఐ'లో గురు పూజోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

వర్షాలు, వరదల కారణంగా వాయిదా పడిన గురుపూజోత్సవ వేడుకలను ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాలల విద్యార్థులు వట్లూరు శ్రీన్వెన్షన్ ఏసి హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ మాట్లా డుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్దేశకుడు గురువేనని, తల్లిదండ్రులు మనకు జీవం ఇస్తే గురువు జీవితం ఇస్తాడని, అటువంటి గురువును మనం ఎప్పుడూ స్మరించుకుని గౌరవించుకోవాలని చెప్పారు. గురువు లేని జీవితం అంధకారమన్నారు. గురువులం దరినీ ఘనంగా సత్కరించి అందరికీ గురు పూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ర్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్. సత్యనారాయణ, సిహెచ్ఎన్‌వి.సత్యనారాయణ, సిహెచ్.శివకుమార్, కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, ఎ.చంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

ఘనంగా హరిసర్వోత్తమరావు జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధులు, పత్రికా రచయిత, సాహితీకారుడు, గ్రంథాలయోద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 141వ జయంతి కార్యక్రమం శనివారం ఏలూరు జింగిల్ బెల్స్ స్కూల్‌లో నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ వి.సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవితమంతా దేశ సేవకు అంకితం చేసిన ఆంధ్రా తిలక్ గాడిచర్ల అని, విద్యార్థిగా ఉండగానే బిపిఎన్.చంద్రపాల్ ప్రసంగాలకు ఉత్తేజితులై స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని మొదటి రాజకీయ ఖైదీ అయిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సామాజిక కార్యకర్త కెబి.రావు, స్కూల్ ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ స్ఫూర్తిని కలిగించే గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని చక్కగా చదువుకుంటూ అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను ఉపయోగించుకుని జీవితంలో గొప్ప వ్యక్తులుగా తయారవ్వాలన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం - కన్నాపురం రోడ్డులోని ప్రసిద్ధి గాంచిన వినాయక ఆలయం వద్ద రోడ్డుపై ఉన్న గొట్టాల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఆలయ కమిటీ వారు స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్ఎ వెంటనే స్పందించి జనసేన కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్‌కు ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. శ్రీనివాస్ పంచాయతీ సర్పంచి ముప్పిడి విజయ్ కుమారితో మాట్లాడి టిడిపి, బిజెపి, ఇతర పార్టీల నాయకుల సహకారంతో రోడ్డుపై ఉన్న గొట్టాలను పూడ్చే పనిని చేపట్టారు.

విస్తరణాధికారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయ బహుళ ప్రయోజన విస్తరణాధికారుల సంఘం బలోపేతానికి సహకరించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు కోరారు. భీమడోలులోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం సంఘ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కమిటీ ఎన్నికలను చేపట్టారు. పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షులతో పాటు సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తమ రెడ్డి, ఫణి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షులుగా భీమడోలుకు చెందిన గణపవరపు ఫణికుమార్, అసోసియేట్ కార్యదర్శిగా పి.అజయ్, సంయుక్త కార్యదర్శులుగా సురేష్, భరత్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ప్రసన్నకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పరిశీలకులు తెలిపారు.

నిల్వ నీరు మోటార్ల ద్వారా తొలగింపు

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర వ్యాప్తంగా వరద పీడిత పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఒక్కో పంచాయతీకి రూ.లక్ష విరాళం ప్రకటించారు. అందులో భాగంగా గూటాల గ్రామ పంచాయతీకి రూ.లక్ష గ్రామ సర్పంచి, గ్రామ సెక్రటరీలకు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా అందించారు. గూటాలలో కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పల్లీలవీధి నీట మునిగింది. నీటిని గ్రామ పంచాయితీ సెక్రటరీ తాతి విజయ కుమారి అధ్వర్యంలో మోటార్ల సహాయంతో బయటకు తోడించారు.

విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు జాతీయ భాష హిందీ కూడా నేర్చుకుని పట్టు సాధించాలని బండివారిగూడెం ఎంపియుపి పాఠశాల హెచ్ఎం డి.బాజా అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం హిందీభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.బాజా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఒకటి కంటే ఎక్కువ భాషాలు నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. ముఖ్యంగా హిందీ భాషాను నేర్చుకోవడం వల్ల విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందినవారికి సర్పంచి నాళం టిరీషా కాశీ దంపతుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రభుత్వాసుపత్రిలో సకాలంలో వైద్యం అందించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వస్తున్నటువంటి రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సిపిఎం జిల్లా కమిటీ తరపున కలెక్టర్‌కి వాట్సాప్ ద్వారా వినతిపత్రాన్ని పంపిస్తూ, శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులు ఆయుష్మాన్ భారతి కోసం ఓటిపి తప్పనిసరి అవడంతో ఈ ప్రక్రియకు చాలా ఆలస్యమవుతుందని తెలిపారు. స్కానింగ్‌ల విషయంలో కూడా రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్‌ని కలిసేందుకు ఆయా రూముల వద్ద ఎదురుచూసే క్రమంలో కేవలం ఐదు లేదా ఆరు కుర్చీలు మాత్రమే ఉంచడంతో మిగిలిన వారందరూ గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితులపై ఆసుపత్రి ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులను విడుదల చేయించుకొని రోగులకు అసౌకర్యం కలగకుండా, వైద్యం సకాలంలో అందే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ కోసం, సౌకర్యాల కోసం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ముసునూరు

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ మరీదు నాగరాజు, డైరెక్టర్ కె.నాగబాబు తమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ కలిసి వరద బాధితుల కోసం సిఎం సహాయ నిధికి రూ.50 వేల చెక్కును అందించారు. సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచి కాటేపల్లి సత్యనారాయణ, పలువురు టిడిపి నాయకులు కలిసి అందించారు.

ఉంగుటూరు : విజయవాడలో వరద బాధితులకు నారాయణపురం లవ్ ఇన్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ తరపున నిత్యావసర సరుకులు వితరణ చేసినట్లు ప్రెసిడెంట్ పాల్ దినకరన్ వెల్లడించారు. ట్రస్టు సభ్యులు బాధితులకు సాయం అందించారు. ఫెయిత్ చర్చి ఫాస్టర్ ప్రసాద్ ,పండుబాబు యూత్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు సత్రంపాడులోని సాయి మధు ఆర్కెడ్ అపార్ట్‌మెంట్‌లో వీక్లీ యాక్టివిటీలో భాగంగా డోర్ టు డోర్ సెక్యూరిటీ ఆడిట్స్, ఎల్‌హెచ్ఎంఎస్ గురించి సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ వారి సిబ్బంది శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్‌కు వచ్చి వెళ్లే వారిపై దృష్టి సారించాలని, అపార్ట్‌మెంట్ సీసీ టివి స్టోరేజ్‌ను నెల రోజులకు పెంచాలని సూచించారు. ఎవరి కదలికలపై అనుమానాలు ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది అహ్మద్, రాజు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - కామవరపుకోట

స్ఫూర్తి దాతల విగ్రహాల వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. తాడిచర్ల సెంటర్‌లో బిసి, ఎస్‌సి కాలనీ వద్ద ఉన్న ఎన్‌టిఆర్, బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, స్థానిక టిడిపి నాయకుడు మడపర్తి రామారావు విగ్రహాల వద్ద నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అలాగే 45వ పుట్టినరోజు జరుపుకుంటున్న తాడిచర్ల సర్పంచి పార్థసారధితో కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళీరామకృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వేముల హనుమంతు, సర్పంచి పసుమర్తి పార్థసారధి బాబు, ఘంటా సుధీర్ బాబు, అడమిల్లి సర్పంచి గుడపాటి కేశవరావు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మండవల్లి

ముంపు బారిన పడిన గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబు తెలిపారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొల్లేరులోకి అధికంగా వచ్చి చేరిందన్నారు. దీంతో మండవల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు పూర్తిగా నీట మునిగాయని తెలిపారు. అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు వరద తగ్గిన గ్రామాల్లో డ్రెయినేజీలో పూడికలు తీయించడంతోపాటు, వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లోని వీధుల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని, దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు. తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులతో రోడ్లపైకి వాలిన చెట్లను తొలగిస్తున్నామన్నారు. ఆరోగ్య సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముంపునకు గురైన గ్రామాల్లో వైద్య సేవలందించేలా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మరికొన్ని గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయని, వరద తగ్గిన అనంతరం పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

'ఎన్నికల హామీల అమలుకు కృషి'

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని నామవారం నుంచి సీతానగరం వరకు రోడ్డు పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు వెంబడి గ్రామాలకు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రోడ్డు పూర్తి చేసి విద్యార్థులకు, ప్రజలకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. హామీలు అమలు చేయటానికి ఎంఎల్ఎ, ఎంపీలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరనేని గోపీబాబు, పార్టీ మండలాధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, పట్టణ అధ్యక్షుడు, పక్కాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి చిట్లూరి ధర్మరాజు, ప్రగడవరం మాజీ ఎంపిటిసి కనమతరెడ్డి రాజారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, నామవరం సర్పంచి వెంకటేశ్వరరావు, ఉర్లగూడెం సర్పంచి యువరాజు పాల్గొన్నారు.

ఇకపై ఎంఇఒలకు పరిమిత అధికారాలు

కాంప్లెక్స్ హెచ్ఎంలకే సర్వాధికారాలు

ప్రజాశక్తి - దెందులూరు

పాఠశాల విద్యావ్యవస్థలో పెను మార్పులు, సంస్కరణలు తీసుకురావడానికి కసరత్తు జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా, మండల, డివిజన్ల విద్యా శాఖాధికారుల సమావేశంలో ఉన్నతాధికారులు సంకేతాలు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 163 స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్యను సుమారు 125కి కుదించనున్నారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో కనీసం 35 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటిలు) ఉండేలా కేడర్ స్ట్రెంగ్త్‌ను ప్రామాణికంగా తీసుకుని కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇక మీదట కాంప్లెక్స్ హెచ్ఎంకు విశేష అధికారాలు రానున్నాయి. ఆ ప్రకారం ఎస్‌జిటిలకు సంబంధించిన సర్వీస్ మేటర్లు, సెలవుల మంజూరు తదితర ఎగ్జిక్యూటివ్ అధికారాలన్నీ ఇపుడున్న ఎంఇఒల నుంచి కాంప్లెక్స్ హెచ్ఎంలకు బదలాయించనున్నట్టు సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం మండల స్థాయిలో ఉన్న ఇద్దరు ఎంఇఒల వ్యవస్థను సవరించి ఒక ఎంఇఒ మాత్రమే ఉండేలా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంఇఒ-2ని తొలగించడంతో పాటు, ఎంఇఒ-1ని కేవలం పాఠశాలల తనిఖీ అధికారిగా మాత్రమే అధికారాలను పరిమితం చేయనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఎంఇఒ-2లు అందరూ ఇక పంచాయతీరాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగానే వెనక్కి వెళ్లిపోవడం ఖాయంగా ప్రచారం జరుగుతోంది.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

అన్యాయాలు, అక్రమాలు చేస్తూ ప్రశ్నించిన బాధితుల మీదే తప్పుడు కేసులు పెట్టి వేధించిన వైసిపి నాయకులు, వారికి సహకరించిన ఆనాటి అధికారులు నేడు ప్రజల ముందు చరిత్ర హీనులుగా మిగిలిపోయారని, ప్రజల శాంతియుత జీవనానికి భంగం కలిగిస్తూ శాంతి భద్రతల విషయంలో ఎవరైనా ఆటంకం కలిగిస్తే ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పెదవేగి సిఐగా బాధ్యతలు చేపట్టిన కె.వెంకటేశ్వరరావు ఎంఎల్ఎ ప్రభాకర్‌ను దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి ఎంఎల్ఎను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన పలువురు రైతులు ఎంఎల్ఎను కలిసి పెదపాడు మండలంలోని తమ పంట పొలాలు నీట మునిగి నష్టపోయామని, ప్రభుత్వ నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. వరదల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఎఎంసి మాజీ ఛైర్మన్ మృతికి అభ్యుదయ వాదుల సంతాపం

ప్రజాశక్తి - టి.నరసాపురం

చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్, వైసిపి నాయకులు మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతికి పలువురు కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు సంతాపం ప్రకటించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు శనివారం తెలిపారు. కామవరపుకోటకు చెందిన అశోక్ శ్రీనివాస్ కళలను, కళాకారులను అభిమానించేవారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ప్రముఖ చలనచిత్ర నటుడు దర్శకుడు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సభలకు అశోక్ శ్రీనివాస్ అతిథిగా హాజరై పలువురు కళాకారులను దుశ్శాలువాలతో సత్కరించేవారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు మాట్లాడుతూ తాము ప్రదర్శించే జానపద కళా ప్రదర్శనలను తిలకించి కళాకారులను ఆప్యాయంగా పలకరించి అభినందించే అశోక్ శ్రీనివాస్ మృతి బాధాకరమన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ మృతి చెందారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, సహాయ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధు, సీనియర్ రంగస్థలం కళాకారులు తిరుపతి రమేష్ బాబు, తోట లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, ప్రముఖ కోలాట కళాకారిణిలు బొందలపాటి పద్మావతి, శిరిగినీటి జగదీశ్వరి, ప్రజానాట్యమండలి గాయకుడు కంకిపాటి ఏసుపాదం, కంకిపాటి బుచ్చిబాబు అశోక్ శ్రీనివాస్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో కైకలూరు డివిజన్ ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

యుటిఎఫ్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ సింగిల్, డబల్స్ పోటీలో కైకలూరు డివిజన్ ఉపాధ్యాయులు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నామని బ్యాడ్మింటన్ కోచ్ వి.భాస్కర్ శనివారం తెలిపారు. యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు ఏలూరులో శనివారం నిర్వహించారు. బ్యాడ్మింటన్ పోటీలో సింగిల్, డబల్స్ నిర్వహించారు. ఈ రెండు పోటీల్లో కైకలూరు డివిజన్ నుంచి జిల్లాస్థాయి పోటీలో పాల్గొని బ్యాడ్మింటన్ సింగల్, డబల్స్ పోటీలో ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. ముదినేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, చింతపండు హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.రవికుమార్, వడాలి హైస్కూల్ ఉపాధ్యాయుడు, కోచ్ వి.భాస్కర్, ఇంగిలింపాకలంక హైస్కూల్, అసిస్టెంట్ కోచ్ ఎస్.నాగేశ్వరరావు, ఆటపాక హైస్కూల్ ఉపాధ్యాయుడు, మేనేజర్ ఎన్ఎన్‌వి.ఆంజనేయులు ఈ పోటీలో పాల్గొని జిల్లాస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలో రన్నర్‌గా నిలిచారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఉపాధ్యాయులు

'సెబ్‌ను ఎక్సైజ్‌గా మార్చడం ఆనందదాయకం'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నుంచి ఎక్సైజ్ శాఖగా మార్చడం ఆనందంగా ఉందని ఎక్సైజ్ సిఐ వెంకటరమణ అన్నారు. గత వైసిపి ఎక్సైజ్ శాఖ నుంచి ఎస్ఇబిగా మార్చిందని, టిడిపి కూటమి అధికారంలోకొచ్చాక మళ్లీ తిరిగి ఎక్సైజ్ శాఖగా మార్చడం ఆనందదాయకమని చెప్పారు. సిఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశామని ఆయన తెలిపారు. సిఎం, మంత్రి ఆదేశాలను పాటిస్తామని చెప్పారు.

చింతలపూడి : కొత్త ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే సిఎం చంద్రబాబు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు చేసి మళ్లీ తిరిగి ఎక్సైజ్‌గా మార్చటం చాలా ఆనందదాయకంగా ఉందని ఎక్సైజ్ సిఐ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సిఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇప్పటివరకు అక్రమ మద్యాన్ని అరికట్టే డ్యూటీ మాత్రమే చేశామని, ఇప్పటి నుంచి రెవెన్యూ పెంచే బాధ్యత కూడా మా మీద ఉందని తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ఉంగుటూరు : ఉపాధి హామీ చట్టంలో ఉంగుటూరు మండలంలో జరిగిన పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని ఎస్ఆర్‌పి సూర్యచక్రం తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 1894 వర్కులు చేశారు. ఇందు కోసం 4,43,336 మంది కూలీలకు పని కల్పించి వారికి రూ.12,5,87,393 వేతనాలు ఇవ్వగా మెటీరియల్ కంపోనెంట్‌గా రూ.81,66,322 పనులు మొత్తం కలిపి రూ.12,82 లక్షలు వెచ్చించారు. క్షేత్రస్థాయిలో విచారించేందుకు ఎనిమిది మంది డిఆర్‌పిలతో టీమ్ సభ్యులు గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారు. శనివారం గొల్లగూడెంలో సోషల్ ఆడిట్ తీరును ఎస్ఆర్‌పి పర్యవేక్షించారు. నిష్పక్షపాతంగా తనిఖీలు చేసి ఉన్నది ఉన్నట్టుగా నివేదికను అధికారులకు అందిస్తామన్నారు. ఎక్కడైనా ఏ గ్రామాల్లోనైనా అవకతవకలు జరిగినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వాటిపై కూలంకుషంగా విచారణ చేస్తామన్నారు.

'కుట్రతోనే ఆటోనగర్ కమిటీపై దుష్ప్రచారం'

దెందులూరు : కొంతమంది కుట్రపూరితంగా, దురుద్దేశంగా అసోసియేషన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏలూరు ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు ఖండించారు. నిజాలను సభ్యులకు, ప్రజలకు తెలియజేసేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మీడియా సమావేశం శనివారం ఆటోనగర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పదవులు కోల్పోయి, తిరిగి ఎలా అయినా అధికారం కావాలని తాపత్రయపడే కొంతమంది వ్యక్తుల ప్రోత్సాహంతో, ప్రోద్బలంతో మరకాల మురళి అతని కుమారుడితో ప్రభుత్వాసుపత్రిలో తనతో పాటు మరికొంత మందిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టించారని తెలిపారు. నిజాలను కప్పిపుచ్చి, అబద్ధపు మాటలతో ఆటోనగర్‌లో అలజడులు సృష్టించడానికి, ఈ కమిటీని అప్రతిష్ట పాలు చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పోలీసు దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో మరకాల మురళి ఆటోనగర్‌లో ప్రెస్ మీట్ పెట్టి అసోషియేషన్‌పై, అధ్యక్షుడైన తనపై నిందారోపణలు, అబద్ధాలు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి అడపా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కర్రి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు సయ్యద్ చోటే, గుమ్మళ్ల వెంకట సూర్యనారాయణ, సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, మాజీ ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, కమిటీ మాజీ సభ్యులు లావేటి రామాంజనేయులు పాల్గొన్నారు.

పలుచోట్ల పోషకాహార మహోత్సవాలు

ప్రకాశక్తి - కుక్కునూరు

మండలంలోని వేలేరు సెక్టార్‌లో శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ వివిఎన్.రుక్మిణీ ఆధ్వర్యంలో పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారించడానికి ఐరన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలన్నారురు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం ఏవిధంగా తయారు చేసుకోవాలో వివరించారు. పౌష్టికాహారం ఇస్తే పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల ఉంటుందన్నారు. అనంతరం సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కుక్కునూరు, వేలేరు, సెక్టార్ సూపర్‌వైజర్ వివిఎన్.రుక్మిణీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలింతలు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తట్కూరుగొమ్ము పంచాయతీలోని జగన్నాధపురం అంగన్వాడీ కార్యాలయంలో సూపర్‌వైజర్ మయూరి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన మండల నాయకులు హాజరై గర్భిణులకు చీరలు, గాజులు అందించారు. ఈ సందర్భంగా జనసేన మండల ప్రధాన కార్యదర్శి మెచినేని సంజయ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది కలిసి గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సూపర్ వైజర్ మయూరి మాట్లాడుతూ పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలన్నారు. జగన్నాధపురం ఐసిడిఎస్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దేవిరెడ్డి సుధాకర్, బంధం వీరాస్వామి, రామకృష్ణ, అంగన్వాడీ టీచర్లు నాగమణి, రమాదేవి, సరోజిని, జయ, లక్ష్మి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సేవాగుణం

ప్రజాశక్తి - నూజివీడు



పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొమిరి కృష్ణమూర్తి నిరంతరం తమ సేవాగుణాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి తనకు తోచిన విధంగా వస్తు రూపంలో గానీ, ధన రూపంలో గానీ ఆర్థిక సహాయం అందిస్తూ వారి పునరావానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తాజాగా వచ్చిన వరదల్లో చెరువుకు గండిపడి ఏలూరు జిల్లా నూజివీడు మండలం బివి.గూడెం గ్రామంలో టి.కేశవులు కుటుంబం నిరాశ్రయులైంది. ఇల్లు పూర్తిగా కొట్టుకుపోవటంతో తన వంతుగా ఆ కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. గతంలో ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన ఎస్.కీర్తి, కృష్ణవేణి కుటుంబాల్లోని పిల్లల చదువుల నిమిత్తం రూ.2500 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఒరిజనల్ టి.సి. పోయింది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, కోంద్రుకోట గ్రామంకు చెందిన షేక్. ఫరీదాషబా తండ్రి యూసఫ్ పోలవరం గ్రామం నుండి కార్మేలపురం(కచేరి)కి ఆటోలో వెళ్ళు చుండగా బి.కాం.డిగ్రీ ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్ (టి.సి)పోయింది. (ఎస్.కె.ఆర్.మహిళా కళాశాలలో 2021-2023 సంవత్సరం, రాజమహేంద్రవరంలో చదువుకున్నది) నా టి.సి. దొరికిన వారు షేక్.ఫాతి మున్నీసా, పోలవరం,సెల్:9490295119 చిరునామాలో సంప్రదించవలెను.

దస్తావేజులు పోయినవి

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణంకు చెందిన బండి త్రిమూర్తులు గారి భార్య లక్ష్మి గారి పేరు మీద గల ఇంటి దస్తావేజులు నెం.535/2013 నేను అనగా సూదిన నర్సింహారావు గారి కుమార్డు అయిన నేను ఈ దస్తావేజులు పాలకొల్లులో ICICI బ్యాంక్ వద్ద మెయిన్ రోడ్డులో నా మోటార్ సైకిల్‌పై తీసుకువెళు చుండగా బ్యాగ్‌తో పాటు పడిపోయినవి. నేను ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికినచో అందజేయగలరు.

సూదిన శ్రీను, S/o.నర్సింహారావు, 43-6-67, సలాది వారితోట, ఆంజనేయస్వామి గుడి వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా. సెల్ : 99511 11147

పాస్‌పోర్టు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, చాగల్లు మండలం, చంద్రవరం గ్రామానికి చెందిన రవికిషోర్ పాస్‌నెం.P7898700 పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఇరగవరం లోని వానపల్లి మారియ్య గారి ఇంటికి వచ్చి మోటారు సైకిల్‌పై వెళుతూ ఏలేటిపాడు గ్రామం వచ్చి చూసుకునే సరికి నా ఒరిజినల్ పాస్‌పోర్టు కనిపించలేదు. మార్గమధ్యంలో పడిపోయినదని వెతికి చూశాను. కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

కాట్రు రవికిషోర్, S/o.కాట్రురాజు, డోరునెం.4-33, చంద్రవరం, చాగల్లు మండలం, ప.గో.జిల్లా. సెల్: 9346019363.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం వేంపాడు గ్రామానికి చెందిన దేశాబత్తుల కరుణాకుమారి భర్త : యోబు అను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది నాయొక్క పాస్పోర్ట్ నెంబర్ : N1497993 గల పాస్పోర్ట్ కాళ్ల నుండి పాలకొల్లు బంధువుల ఇంటికి వచ్చి, వారి ఇంటి నుండి పాలకొల్లు బస్ స్టాండ్ దగ్గర గల జిరాక్స్ సెంటర్ కు వెళుతుండగా నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

దేశాబత్తుల కరుణా కుమారి, భర్త : యోబు క్రిస్టియన్ పేట, వేంపాడు, డోర్ నెం : 1 - 13 కాళ్ళ మండలం , ప.గో.జిల్లా పన్ : 534206 , సెల్ : 9391337957

IN THE COURT OF THE HON'BLE VII ADDL. JUNIOR CIVIL JUDGE, R.R.DISTRICT, AT: HAYATHNAGAR
O.S.No: 497 OF 2019

BETWEEN:
Surabhi Rajender Reddy ...Plaintiff
And
Vignesa Venkata Rama Krishna & Others ....Defendants

To,
1. Vignesa Venkata Rama Krishna Raju, S/o.V.Sathyanarayana Raju, Aged about 47 Years, Occ: Soft Ware Engineer, R/o.NRI, 3-22, A1, Bheemavaram Post, Akiveedu mandal, West Godavari District

The above mentioned Plaintiffs have filed the present suit for Declaration of Registered sale Deeds which are void and not binding on the plaintiffs and Perpetual injunction against the Defendants. As per the orders passed by this Hon'ble court I am issuing this Publication in newspaper to the Defendant No: 1. Vignesa Venkata Rama Krishna Raju,S/o.V.Sathyanarayana Raju in the above Suit. Hence You are hereby required to appear before this Hon'ble court on **30-10-2024** at **10.30**A.M. either in person or through an Advocate, duly instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.

// By order of the Court //

M/s.P.SRIDHAR
K.LAVANYA
Advocates
H.No.11-13-43,Alkapuri, Road No.1, SBI Bank Lane, Hyderabad-102.
Phone : 9848944637



ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

44వ వార్షికోత్సవ

ప్రత్యేక అనుబంధం

ఏలూరు జిల్లా

సెప్టెంబర్ 2024

8 పేజీలు

4

Advt.feature

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

తెలుగు నేలపై చైతన్య కిరణం ప్రజాశక్తి. 'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'గా సాగుతూ ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి అసలుసిసలైన ప్రతీక.. ప్రజాశక్తి. ఇది అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను చీల్చి చెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజ మెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. ప్రజలే దీనికి అండాదండ. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలం చెలుగా ఎదుగుతూ నేడు 44వ వార్షికోత్సవం నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం.

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉర్రూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతోంది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమ బెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది. ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు-దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ - ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాలరీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద ..2లో













ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(మొదటి పేజీ నుంచి)

ద్ధ యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషి కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు. ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ఉండటం వంటి అంశాలపై ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం. ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లేఅవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతోతరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

కరోనా కష్టకాలం

కరోనా కష్టకాలంలో పత్రిక తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. అనివార్యంగా ఇతర పత్రికలతో పాటు టాబ్లాయిడ్ నిలిపివేసి మెయిన్‌లోనే రెండు బ్రాడ్ పేజీలు జిల్లా వార్తలకు కేటాయించి నడిపింది. సిబ్బంది కరోనా బారిన పడినా.. ఆర్థిక ఇబ్బందులు ముసురుకున్నా వెరవకుండా సిబ్బంది అకుంఠిత దీక్షతో ప్రజల సహకారంతో పత్రికను నిర్విరామంగా తీసుకొచ్చారు. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక మళ్లీ టాబ్లాయిడ్ పునరుద్ధరణకు ప్రయత్నాలు చేస్తోంది. దానిలో భాగంగా ఇప్పటికే విజయవాడ, గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లో టాబ్లాయిడ్ తీసుకొస్తున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఆర్థిక భారమైనా వెరవకుండా కొత్త జిల్లాల ప్రాతిపదికనే పేజీలు తీసుకొస్తున్నారు. ఎన్ని ఆటంకాలు.. ప్రతిబంధకాలు ఎదురైనా, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా ప్రజల అండదండలే శ్వాసగా ప్రజాశక్తి 'ప్రతి అక్షరం.. ప్రజల పక్షం' నినాదానికి కట్టుబడి పురోగమిస్తుంది.



మండలాభివృద్ధికి కృషి

జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు



ప్రజాశక్తి - టి.నరసాపురం

కూటమి ప్రభుత్వంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సహకారం, మండలంలోని టిడిపి, బిజెపి, జనసేన నాయకులందరి సమన్వయంతో మండలాభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మండలాభివృద్ధి కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. మండలంలో ప్రధానంగా ఆర్‌అండ్‌బి, సీసీ రోడ్లు, తాగునీటి సమస్య, డ్రెయినేజీలు, గృహ నిర్మాణం వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. ఎంఎల్‌ఎ, ఎంపీ నిధులతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. విద్యుత్ సౌకర్యాలు లేని వల్లంపట్ల వంటి కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న టి.నరసాపురం పశువుల ఆసుపత్రి, నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలు, ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల గురించి ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లి పూర్తయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వం తప్పిదం వల్ల నిధులు లేక పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వంలో పవన్‌కళ్యాణ్ మంత్రిగా నిధులు కేటాయించారని తెలిపారు. పంచాయతీ పాలకులు సమన్వయంతో నిధులు దుర్వినియోగం కాకుండా శానిటేషన్, వీధిలైట్లు, డ్రెయినేజీ, పూడికతీతలు, ఇంటింటికీ తాగునీటి కుళాయి, అన్నిరకాల అభివృద్ధి పనులూ చేపడతామని చెప్పారు. అభివృద్ధి విషయంలో కూటమి నేతల సూచనలు, సలహాలు పాటిస్తూ సమన్వయంతో పని చేస్తానన్నారు. మీడియా ద్వారా బయటకొచ్చే సమస్యలపై స్పందిస్తానని, పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలూ, సంక్షేమ పథకాలూ అర్హులందరికీ అందేలా చూస్తానని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాల్లో నివాసయోగ్యం కాని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుకూలంగా ఉండే స్థలాల మార్పునకు దృష్టి పెడతామన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేనివారికి కూటమి ప్రభుత్వంలో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు మంజూరు, గత ప్రభుత్వంలో ఒక్క బిల్లు పడని లబ్ధిదారులకు, కేవలం ఒక్క రూపాయి పడిన వారికి లాభం చేకూరుతుందని, పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, ప్రారంభించనివి కూడా పూర్తవుతాయని, లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని చెప్పారు. పుంత రోడ్లు, కల్వర్టులు, పంట పొలాలకు వెళ్లే రోడ్లు, చెరువుల అభివృద్ధి, పూడిక తీతలు, లింకు రోడ్లన్నీ ఎంఎల్‌ఎ, ఎంపీ నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

జనసేన బలోపేతానికి కృషి

జనసేన మండల ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ సిహెచ్ నవీన్



ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో జనసేన బలోపేతానికి పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సహకారంతో జనసైనికులందరితో కలిసి కృషి చేస్తానని జనసేన మండల ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ సిహెచ్ నవీన్ అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో జనసేన సభ్యత్వానికి అనేక మంది ముందుకొస్తున్నారని, మండలంలో ఐదు వందలున్న సభ్యత్వాలు 18 వందలకు పైగా పెరిగాయని, వచ్చే ఎన్నికల నాటికి పది వేలకు పైగా పూర్తి చేసేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇతర పార్టీల నుంచి జనసేనలో చేరేందుకు కొందరు నేతలు సంప్రదిస్తున్నారని, పార్టీ పెద్దలతో మాట్లాడి మచ్చలేని నీతి నిజాయతీ గల వారినే చేర్చుకునేందుకు త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జనసేనకు ఆర్థిక బలం ఉన్న వారికంటే రబ్బరు చొప్పులతో తిరిగేవారైనా నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు పవన్‌కళ్యాణ్ ఇస్తారని, సామాన్యులకు ఎంఎల్‌ఎ టికెట్ ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అందుకు నిదర్శనమే పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అని తెలిపారు. జనసేనలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని, మండలంలో మెట్టగూడెంకు చెందిన నూతి సత్యనారాయణ, తిరుమల దేవిపేటకు చెందిన జట్ల నాగ దుర్గారావు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పార్టీ అధిష్టానం అందించిందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 2న మండలంలో బ్లడ్ క్యాంపు, గ్రూప్ టెస్ట్ క్యాంపులు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎవరికీ ఏ గ్రూప్ బ్లడ్ అవసరమైనా అందిస్తామన్నారు. టి.నరసాపురంలో ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, పార్టీ పెద్దలు కరాటం సాయి, గడ్డమడుగు రవికుమార్ మండల నాయకులతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసి ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జనసేన మండల ప్రధాన కార్యదర్శి మధ్యాహ్నపు చిన పెంటారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ మండలంలోని కూటమి నాయకులందరితో కలిసి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు మండలంలో అర్హులందరికీ అందేలా చూస్తామని జనసేన మండల ప్రధాన కార్యదర్శి మధ్యాహ్నపు చిన పెంటారావు తెలిపారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అమలు చేయబోతున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూస్తానన్నారు. అంతేగాక గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు ఎంఎల్‌ఎ, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మండల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా జనసేన పని చేస్తోందన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేనివారికి కూటమి ప్రభుత్వంలో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల మంజూరుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క బిల్లు కూడా పడని లబ్ధిదారులకు, కేవలం ఒక్క రూపాయి పడిన వారికి కొత్త ప్రభుత్వంలో రూ.4 లక్షలు మంజూరవుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, ప్రారంభించనివి పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందొద్దన్నారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల సౌకర్యాలనూ ప్రజలు వినియోగించుకోవాలన్నారు.




















ప్రతిభకు నిలయం.. గురుకుల విద్యాలయం



ఉత్తమ విద్యాబోధనతో ఉన్నత ఫలితాలు - విద్యార్థుల బంగారు భవిష్యత్తే ఉపాధ్యాయుల లక్ష్యం

ప్రతియేటా 'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత పాఠశాల సొంతం

ట్రిపుల్ ఐటిలో తొమ్మిది మందికి సీట్లు



ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది, వారు ఉన్నత స్థాయికి ఎదగడానికి అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రతిభకు నిలయంగా ఉందని చెప్పవచ్చు. ఉపాధ్యాయ సిబ్బంది అందిస్తున్న ఉత్తమ విద్యా బోధనతో విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారు. అందుకు ట్రిపుల్ ఐటిలో ప్రతి ఏడాది అధిక సంఖ్యలో విద్యార్థులు సీట్లు సాధించడమే ఉదాహరణ. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల సలహాలు అందిపుచ్చుకుని ఆరేళ్ల పాటు ఇంటిని, తల్లిదండ్రులను విడిచి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నారు విద్యార్థులు. 1983లో మండలంలోని అప్పలరాజుగూడెంలో స్థాపించబడిన బాలుర గురుకుల పాఠశాల జిల్లాలో ఏకైక బాలుర పాఠశాలగా ఉంది. నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారికి మంచి భవిష్యత్తుకు పునాది వేస్తున్నారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, కొందరు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీర్, టీచర్స్ వంటి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ బి.శంకరరావు చెబుతున్నారు. అంతే కాకుండా పూర్వ విద్యార్థుల, దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారు. దీంతో పాఠశాలలో గత మూడేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. గత 2023-24 విద్యాసంవత్సరంలో పది ఫలితాల్లో 72 మందికి 72 మంది నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా, 584 మార్కులు సాధించి తిరుమల్లి జగన్నాథం మండల ప్రథమస్థానంలో నిలిచారు. అంతేకాక 550పైగా మార్కులు సాధించిన వారిలో 9 మంది ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. గత ఏడాది కూడా 8 మంది వరకు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. ఇలా ప్రతి ఏడాది ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది 52 మంది వరకు 500లకు పైగా మార్కులు సాధించిన ఘనత పాఠశాలకు దక్కుతుంది. ఒకప్పుడు కనీస సౌకర్యాలు లేని పాఠశాలగా ఉంది. కానీ ఇప్పుడు అహ్లాదకరమైన పరిసరాలు, చక్కటి సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలల కంటే సౌకర్యవంతంగా మారింది. పాఠశాలలో డిజిటల్ తరగతితో పాటు ప్రత్యేకమైన సైన్స్, గణిత ప్రయోగశాలలు, గ్రంథాలయం వాటితో పాటు విశాలమైన ఆటస్థలం, ఆహ్లాదకర వాతావరణం, ఆర్వో వాటర్ ప్లాంట్ వంటివి మైమరిపిస్తున్నాయి. దాంతో విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తున్నారు.


ఉపాధ్యాయులు సొంత పిల్లల్లాగా చూసుకుంటారు



టి.జగన్నాథం, ట్రిపుల్ ఐటి విద్యార్థి

నేను 2018లో అయిదో తరగతిలో జాయిన్ అయ్యాను. పదోతరగతి వరకు చదివాను. ప్రిన్సిపల్ శంకరరావు, ఉపాధ్యాయులు మమ్మల్ని సొంత పిల్లలుగా చూసుకునేవారు. వారు అందించిన శిక్షణతో బాగా చదివి, పదిలో 584 మార్కులు సాధించి, మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. సొంతంగా బిజినెస్ చేయాలని ఉంది.

పాఠశాల్లో సౌకర్యాలు బావున్నాయి



పి.ఆదర్శ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

గత ఆరేళ్లుగా అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలో చదివా, పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయి. చక్కటి భోజనం, ప్రభుత్వం అందించిన సౌకర్యాలతో పాటు పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. నాణ్యమైన విద్య అందిస్తూ మమ్మల్ని బాగా చదివించారు. ఉపాధ్యాయుల సహకారంతో పదిలో 577 మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించా, సాఫ్ట్వేర్ అవ్వాలని ఉంది.

పాఠశాల ఇంటిని తలపిస్తుంది



జి.తరుణ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

మా పాఠశాల వాతావరణం మా ఇంటిని తలపిస్తుంది. ఇక్కడ చదువుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఉపాధ్యాయుల బోధన, మా కృషి ఫలితంగా పదోతరగతిలో 571 మార్కులు సాధించా. హైజంప్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు సాధించా, ఐపిఎస్ అవ్వాలని ఉంది.

ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు



ఎం.అజయ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి, అర్థవంతంగా పాఠాలు బోధించే వారు, దీంతో విద్యలో వెనకబడకుండా బాగా చదివి, పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించి, ట్రిపుల్ ఐటిలో సీటు సాధించా. ఐఎఎస్ అవ్వాలని ఉంది.

ఉపాధ్యాయ సిబ్బంది ఎంతో శ్రద్ధ చూపుతారు



ఇ.ప్రసన్నకుమార్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

ప్రతి విద్యార్థిపట్ల ఉపాధ్యాయ సిబ్బంది ఎంతో శ్రద్ధ చూపుతారు. విద్యలో తోడ్పాటు అందించడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో చక్కని అహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది. అందువల్లే పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించా.


ఉపాధ్యాయుల తోడ్పాటు మరువలేం



పిఎస్ ఎం.భార్గవ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

2018లో 5వ తరగతిలో ప్రవేశం పొందా. అప్పటి నుంచి పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది, ప్రిన్సిపల్, వార్డెన్, ప్రతిఒక్కరూ విద్యార్థులకు చక్కటి తోడ్పాటు అందిస్తారు. వారి సహకారం పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడింది. మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించా. ఉపాధ్యాయుల తోడ్పాటు ఎప్పటికీ మరిచిపోలేను.

విద్యాబోధన బావుంది



పి.వివేక్ కళ్యాణ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యాబోధన అర్థవంతంగా ఉంటుంది. ఎలాంటి విద్యార్థికైనా పాఠాలు అర్థమయ్యే రీతిలో చెబుతారు. ప్రిన్సిపల్ శంకరరావు, ఇతర సిబ్బంది మాతో స్నేహంగా ఉంటూ, మాకు సందేహాలు తీరుస్తూ, ఉత్తమ విద్య అందించడం ద్వారా పదిలో మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించా. ఇంకా బాగా చదివి సాఫ్ట్వేర్ అవ్వాలనుకుంటున్నాను.

ఉపాధ్యాయుల సహకారంతోనే మంచి ఫలితాలు



పి.రామ్‌చరణ్, ట్రిపుల్ ఐటి విద్యార్థి

ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన, పూర్వ విద్యార్థుల ఆదర్శంతో పదిలో మంచి ఫలితాలు సాధించగలిగాం. ట్రిపుల్ ఐటిలో 9 మంది సీట్లు సాధించగలిగాం. బయట పాఠశాలల కంటే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది మాకు తోడుగా ఉంటూ ధైర్యం చెబుతారు. వారి సహకారం మరిచిపోలేను, ఇంకా బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతారు



కె.నంద కిశోర్ ట్రిపుల్ ఐటి విద్యార్థి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, వారి ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ప్రతిరోజూ యేగా, వ్యాయామం చేర్పించడం, క్రీడల్లో ప్రోత్సాహం అందించడం చేస్తుంటారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యం చేయిస్తారు. నాణ్యమైన విద్యాబోధన వల్లే పదిలో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించ గలిగాము.

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నదే మా లక్ష్యం



డిఎస్ బి.శంకరరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, అప్పలరాజుగూడెం

పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నదే ఉపాధ్యాయ సిబ్బంది ప్రధాన లక్ష్యం. 5 నుంచి పదోతరగతి చదివే విద్యార్థులు అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించి, పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించగలిగాం. విద్యార్థులు చక్కగా చదువుతున్నారు. పదిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాం. ట్రిపుల్ ఐటిలో 9 మంది సీట్లు సాధించారు. గత ఏడాది కూడా 8 మంది సీట్లు సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎక్కువ మంది ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించేందుకు కృషి చేస్తాం.

> అందమైన బాహ్య రూపం
> ఎప్పుడైనా మోసం చెయ్యవచ్చు.
> కానీ విప్లవం పట్ల నిబద్ధత గల ఆత్మ
> సౌందర్యం ఏనాటికీ మోసం చెయ్యదు.
> - మావో









ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్: పూనెం ఆదిత్య



టి.నరసాపురం: మండలంలో జనసేన ఆధ్వర్యంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సహకారంతో మండల కన్వీనర్ అడపా నాగరాజు, ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ సిహెచ్.నవీన్, జనసేన నాయకులు క్రియాశీలక సభ్యులందరూ కలిసి ప్రజా ఫిర్యాదుల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. టి.నరసాపురంలో జనసేన కార్యాలయం ప్రారంభించిన తర్వాత హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. తమ నేతలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.







మురిపిస్తున్న.. ముంజులూరు వాటర్‌ఫాల్స్

దట్టమైన అటవీ ప్రాంతంలో సహజసిద్ధ జలపాతం
సుదూర ప్రాంతాల నుండి తరలొస్తున్న సందర్శకులు
పర్యాటక శాఖ గుర్తించి అభివృద్ధి చేస్తే ఉపాధి


ముంజులూరు అటవీ ప్రాంతం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ముంజులూరు గ్రామ శివార్లలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల్లో కురిసే విస్తార వర్షాలకు కొండ వాగుల ద్వారా చేరుకున్న నీరు కొండలూ, చాప రాళ్లపై నుండి కిందకు ఉరుకుతూ ఎంతో అందంగా.. ఆహ్లాదకరంగా కన్పించే సహజసిద్ధ జలపాతమే ముంజులూరు జలపాతం. ఈ ముంజులూరు వాటర్‌ఫాల్స్‌ను చూడడానికి వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుండి విద్యార్థులు, యాత్రికులు పెద్దసంఖ్యలో మోటార్ సైకిళ్లు, కార్లు, ప్రయివేటు వాహనాలపై తరలొస్తున్నారు. ఈ ముంజులూరు జలపాతాన్ని చేరుకోవడానికి కన్నాపురం నుండి 15 కిలోమీటర్ల దూరం. ముంజులూరు చేరుకున్నాక అక్కడి నుండి దట్టమైన అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. మోటార్ సైకిల్‌పై అయితే ముంజులూరు జలపాతానికి చేరుకోవచ్చు. మార్గమధ్యంలో దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో చుట్టూ గిరిజన సాంప్రదాయాలతో కోయ, కొండరెడ్డి గిరిజన ప్రజలు నివాసం ఉండటం కన్పిస్తోంది. వాళ్ల సంప్రదాయ వస్త్రధారణ, జీవన విధానం చూడడానికి ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. ముంజులూరు వాటర్ ఫాల్స్


వాటర్ ఫాల్స్

అనేసరికి యువకులు కేరింతలు కొడతారు. జలపాతం నీటిలో తడుస్తూ ఆనందాన్ని పొందుతారు. ముంజులూరు జలపాతానికి వచ్చి స్నానాలు చేసే మహిళలు దుస్తులు మార్చుకోవడానికి అక్కడున్న గిరిజన యువత వెదురుబొంగులతో ప్రత్యేక నిర్మాణం చేశారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ప్రయాణం కొంచెం ప్రమాదకరంగా ఉంటుంది. జలపాతం దగ్గర ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలూ ఉన్నాయి. ఈ మార్గం ప్రమాదాల నిలయంగా మారడంతో అక్కడున్న గిరిజన గ్రామాలకు చెందిన యువత ఆ మార్గాన్ని కొంతవరకు బాగు చేశారు. అందుకుగాను వారు వాటర్ ఫాల్స్‌కు వెళ్లడానికి రూ.20 రుసుము వసూలు చేస్తున్నారు. దీంతో పాటు బొంగు చికెన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు.

దీంతోపాటు బుట్టాయగూడెం మండలంలో మరెన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిలో గుబ్బల మంగమ్మ


గిరిజన యువత దారి బాగు చేయకముందు వాటర్‌ఫాల్స్‌కు వెళ్లేమార్గం


గిరిజన యువత దారి బాగు చేశాక వాటర్‌ఫాల్స్‌కు వెళ్లేమార్గం

ఆలయం, జల్లేరు జలాశయం, సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన నందాపురం కాజ్‌వే, ఉప్పరిల్ల జలపాతం, దట్టమైన అడవుల మధ్య సెలయేళ్లు, మరెన్నో జలపాతాలు ఉన్నాయి. ఈ పర్యాటక ప్రదేశాలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉన్న గిరిజన కొండరెడ్డి గిరిజన యువతకు ఉపాధి సైతం లభించే అవకాశాలున్నాయి.




ముంజులూరు నుంచి వాటర్‌ఫాల్స్‌కు వెళ్లే మార్గాన్ని సూచించే బోర్డు


మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గిరిజన యువత చేసిన ఏర్పాటు











విప్లవ పథంలో పయనించే వీరయోధులు,
ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని కూడగట్టుకుంటారు.
చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే,
మనోధైర్యం అంతగా పెరుగుతుంది.
- కార్ల్ మార్క్స్

మండల అభివృద్ధే లక్ష్యం



జనసేన మండల ఉపాధ్యక్షులు మాండ్రు రాము

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల అభివృద్ధే జనసేన ప్రధాన లక్ష్యమని జనసేన మండల ఉపాధ్యక్షులు మాండ్రు రాము అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో టి.నరసాపురం మండలం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసేవిధంగా జనసేన కృషి చేస్తోందన్నారు. మండల జనసేన నాయకులు, టిడిపి, బిజెపి కూటమి నాయకులందరి సమన్వయంతో అభివృద్ధిలో ముందుకు సాగుతామన్నారు. మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి ఎంఎల్ఎ బాలరాజు కృషి చేస్తామన్నారని తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలన్నీ ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ నెరవేర్చి అవ్వాతాతలకు, వికలాంగులకు పెన్షన్ పెంచి పంపిణీ చేస్తున్న ఘనత చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌కు దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

బొర్రంపాలెం పంచాయతీ అభివృద్ధికి కృషి



జనసేన మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

బొర్రంపాలెం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని జనసేన మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్ అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, సిహెచ్ నవీన్, టిడిపి, బిజెపి కూటమి నాయకులతో కలిసి బొర్రంపాలెం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు అధిక నిధులు కేటాయించారని, ఆ నిధులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులకు వినియోగించేలా పంచాయతీ వారికి సహకారం అందిస్తామని చెప్పారు. పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యలు, వీధిలైట్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలను ఎంఎల్ఎ, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు

జనసేన కమిటీ మెంబరు రాఘవరావు సురేష్



ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఎవరికి ఎప్పుడు రక్తం అవసరమైనా అందించేందుకు రానున్న రోజుల్లో జనసేన ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు జనసేన నాయకులు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జనసేన కమిటీ మెంబరు రాఘవరావు సురేష్ తెలిపారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే జనసేన లక్ష్యమన్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలో జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ సిహెచ్ నవీన్, క్రియాశీలక సభ్యులందరూ కలిసి బ్లడ్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ప్రజల అవసరాన్ని బట్టి రక్తదానం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు సేవలందించే విషయంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, నియోజకవర్గంలో జనసేన నాయకుల సూచనలు సలహాలు పాటిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాయకపోడులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి

ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా



ప్రజాశక్తి - టి.నరసాపురం

ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఎ ద్వారా ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో నాయకపోడులకు కూడా అందించాలని ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నాయకపోడులు అన్ని కులాల్లో వెనకబడిన వారిగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఏలూరు జిల్లాలో నాయకపోడులు సుమారు 40 వేల మంది జనాభా ఉన్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు విడిపోయిన తర్వాత జిల్లాలో చింతలపూడి, టి.నరసాపురం మండలాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉండడంతో నాయకపోడులకు ప్రభుత్వం అందిస్తున్న ఐటిడిఎ నిధులు, ఎస్‌టి రిజర్వేషన్ ఫలాలు అందడంలేదన్నారు. ప్రభుత్వాలు నాన్ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నాయకపోడుల గ్రామాలను ఏజెన్సీ ప్రాంతంలో కలపాలని, ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు నాయకపోడులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకపోడుల హక్కుల సాధనకు ఆదివాసి నాయకపోడు కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. వర్గీకరణలో భాగంగా ప్రభుత్వాలు ఎస్‌టి వర్గీకరణ చేపడితే నాయకపోడులకు రిజర్వేషన్‌లో ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకపోడులకు విద్య, ఉపాధి అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.













ఉత్తమ విద్యాబోధనే శ్రీవిద్యానిధి లక్ష్యం

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన - దూరప్రాంత పిల్లల సౌకర్యార్థం బస్ సౌకర్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సొసైటీ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీవిద్యానిధి పాఠశాల విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రత్నం, ప్రిన్సిపల్ మంగరాజు అన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మంచి విద్యను అందించే విధంగా శ్రీవిద్యానిధి పాఠశాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. రెండు సంవత్సరాలుగా పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచుకుంటూ, విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రయివేటు విద్యా సంస్థలతో పోల్చుకుంటే ఇక్కడ



ప్రిన్సిపల్ మంగరాజు

ఫీజులు కూడా తక్కువగా తీసుకుంటూ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే దిశగా అడుగులు వేస్తున్నామని వారు తెలిపారు. ఈ పాఠశాలలో నర్సరీ నుంచి 7వ తరగతి వరకూ విద్యాభ్యాసం నేర్పుతున్నట్లు వారు చెబుతున్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించడంతో పాటు తెలుగు, హిందీ భాషలపై పట్టు వచ్చేలా నాణ్యతతో కూడిన విద్యాభోధన అందిస్తున్నట్లు చెబుతున్నారు. పాఠశాలలో మొత్తం 12 మంది అనుభవం కలిగిన ఉపాధ్యాయ సిబ్బందితో నాణ్యత గల విద్యను అందిస్తూ తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా దూరప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు, మానసిక నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. పిల్లలను దగ్గరుండి చూసుకోవడానికి ఇద్దరి ఆయాలను నియమించినట్లు తెలిపారు. అలాగే క్రీడానైపుణ్యం కోసం యోగా, అబాకస్, డ్యాన్స్ క్లాస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.







